# నిజం




— కిల్లాన మోహన్‌బాబు

అవకాశాలు కలపివచ్చి అధి కారంలోకి వచ్చిన కొందరు, అతి సులువుగా ఓ అనామకుని చేతిలో ఓడిపోవచ్చు! 'అహంభావి' అయిన 'సింహం' ఒక్కోసారి 'చిట్టెలుక' తో మోసపోవచ్చు! అందుకే మనకు కవిపించిందంతా 'నిజం' కాదు! మనకు అంతుపట్ట నంత మాత్రాన 'అబద్ధం' అయి పోదు!

* * *

సాయంత్రం నాలుగయింది. ఆ ఊళ్ళోని పోలీసు స్టేషన్‌లో ఆ సమయంలో ఓ గంభీర వాతా వరణం నెలకొని ఉంది. స్టేషన్ గోడలకు ఆ ముందు రోజే సున్నాలు వేశారేమో — అవి అందంగా, ఆకర్షణీయంగా కని పిస్తున్నాయి. పోలీసులంతా ఇస్త్రీ చేసిన ఖాకీ దుస్తుల్లో చాలా నీట్‌గా కనిపిస్తున్నారు. వాళ్ళ బూట్లు నిగనిగా మెరుస్తున్నట్లు న్నాయి. వాళ్ళ ముఖాల్లో మాత్రం ఆతృత, ఆందోళన ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి- ముఖ్యంగా ఎస్సై ఎల్లారావు ముఖం వివర్ణమై ఉంది!

ఈ హడావుడికి కారణం-ఐ.జి. గారు ఆ ఊళ్ళోనే ట్రావెలర్సు బంగళాలో విడిది చెయ్యడం!

ఆయన మామూలుగా అక్క డికి రాలేదు. ఒక నెల రోజుల క్రితం అదే ఊళ్ళో ఒక పెద్ద దేవాలయాన్ని దొంగలు దోపిడీచేసి, సుమారు పదిలక్షల విలువైన నగ లన్నీ దోచేశారు! ఈ వార్త ఆ ఊళ్ళో ఒక సంచలనాన్ని రేపింది! పేపర్లో ఈ వార్తపడి. దేశం మొత్తం గగ్గోలయి పోయింది. అసెంబ్లీలో ఈ విషయమై ప్రశ్నల వర్షం కురిపించి. దొంగతనం జరిగి నెల రోజులైనా, సమాచారం దొరక్కపోవడంతో ఐ.జి.తో పాటు, పోలీసు విభాగం అంతా ఆ ఊరికి కదిలింది.

ఈ వ్యవహారాన్ని స్వయంగా పరిశీలించడానికి ఐ.జి. గారు అక్కడికొచ్చారు. అందుకే ఆ పోలీస్ స్టేషన్‌లో అంత హడావుడి!

తననేమంటారోనని ఎస్సై ఎల్లారావు ముఖంలో అంత దిగులు.

టైం గడుస్తోంది! అక్కడ అందరి గుండెల్లో రైళ్ళు పరిగెత్తు తున్నాయి. ఐ.జి.గారు అక్కడకి ఐదు గంటలకి వస్తారు. వచ్చినతర్వాత అక్కడి వారందర్నీ ఎలా తిడతారో ముందుగానే ఊహించుకుంటున్న వాళ్ళ ముఖాలు ఆముదం తాగినట్లు తయార య్యాయి.

ఐదు గంటలయింది.

ఐ.జి. గారు రానే వచ్చారు.

జీప్ పోలీసు స్టేషన్ ముందాగింది.

ఐ.జి.గారు జీప్‌లోంచి హుందాగా దిగారు. ఆయన వెనుక డి.ఐ.జి. నుంచి పి.ఐ. వరకూ అందరూ దిగారు. ఆరడుగుల మనిషి ఐ.జి. గారు. ఆయన ముఖంలో దర్జా, హోదా కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. గబగబా స్టేషన్‌లోకి వెళ్ళి ఎస్సై సీట్లో కూర్చున్నారు.

"ఏదీ-ఆ దేవాలయం దోపిడీ ఫైలిలా ఇవ్వండి!" ఆజ్ఞాపించారాయన.

తక్షణం టేబిల్ మీద ఆ ఫైలు ప్రత్యక్షమయింది. అందులో పేజీలు తిరగేస్తున్నారాయన. ఎస్సై గారు తన గుండెల్ని తిరగేస్తున్నంతగా చూస్తున్నారటువేపు.

"దోపిడీ జరిగి దాదాపు నెలయింది. ఇంతవరకూ ఎవర్నీ 'అరెస్టు' చేయలేదు. అనుమానం మీద దొరికిన నలుగుర్నీ సరయిన ఆధారాలు లేక వదిలేశారన్నమాట" అన్నారు ఐ.జి.గారు ఫైలుచూస్తూనే.

"ఎస్సార్!" అన్నారు ఎస్సై గారు అతివినయంగా.

"మీ చేతకాని తనం గూర్చి పత్రికల్లో వస్తున్న వ్యాఖ్యలు చూస్తున్నారా?" సూటిగా ప్రశ్నించారు ఐ.జి.గారు ఎస్సైని.

"నేను శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నాను సార్! కానీ..." ఏదో అనబోయారు ఎస్సైగారు.

"వ్వాట్ నాన్సెన్స్ యూ ఆర్ స్పీకింగ్!" గర్జించారు ఐ.జి.గారు.

"ఇలాంటి సంజాయిషీలు నా కనవసరం. చేతనయితే సరైన 'ఇన్వెస్టిగేషన్' చేసి చూపండి. లేదా మీ వల్ల కాదని రాసివ్వండి-మరొకర్ని 'డెప్యూట్' చేస్తాను. మీలాంటి వారుండబట్టే నా పాపులారిటీ కూడా దెబ్బ తింటోంది. మొత్తం 'డిపార్ట్‌మెంట్' మీద 'రిఫ్లెక్ట్' అవుతోంది. మరో వారం రోజులు మీకు గడువిస్తున్నాను. దొంగలు దొరికారా సరే—లేదా, మీ మీద 'ఏక్షన్' తీసుకోవడం ఖాయం!" సింహంలా గర్జిస్తూ పిడుగులు పడినట్టు మాట్లాడి బయటకు నడిచారు ఐ.జి.గారు.

స్థాణువుగా చలన రహితంగా నిల్చుండిపోయారు ఎస్సై ఎల్లారావుగారు.

ఏం చేయాలో, ఈ సమస్యనెలా పరిష్కరించాలో అర్థంగాక కొయ్య బొమ్మలా అయిపోయారాయన.

"సార్! కాఫీ తీసుకోండి" అన్న 'టూ నాట్ వన్' మాటలతో

యీ ప్రపంచంలోకివచ్చారు ఎస్సై ఎల్లారావుగారు.

"నాకేం పాలు పోవడంలేదు. నా పేరు 'ప్రమోషన్ లిస్టు'లో ఉంది. సరిగ్గా యిలాంటి సమయంలో యీ దొంగతనం జరగడం నా దురదృష్టం. ఈ గండం గడిచేదెలాగో నాకంతు పట్టడం లేదు. నీ సలహా ఏమిటి టూ నాట్ వన్?" అన్నారు ఎల్లారావుగారు కాఫీ సిప్ చేస్తూ.

టూ నాట్ వన్ యిలాంటి వ్యవహారాల్లో కాకలు తీరిన వ్యక్తి. సరైన 'క్వాలిఫికేషన్' లేక అలా 'హెడ్ కానిస్టేబుల్'గా ఉండిపోయాడుగానీ, లేకపోతే యీపాటికి కనీసం 'ఎస్సై' అయ్యుండాల్సిన


శ్రీ బాలాజీ వైద్యశాల

సెక్స్ స్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవ

మార్వాడీ గుడివద్ద, ఫోన్: 551, తెనాలి (ఎ.పి.)

బ్రాంచి: 28, నార్త్ బోగ్ రోడ్, మద్రాస్-17

దీర్ఘవ్యాధులకు వుత్తమ సిద్ధ వైద్యము

హస్త ప్రయోగంవల్ల, అతి సంభోగము వలన అంగము చిన్నదై అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక్క దోస్‌తో ఎన్నడూ, కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తిచెందు



స్త్రీ, పురుషులు వాడదగినది-స్వస్థులు.) హెర్నియా (గిలక) కుష్టు, బొల్లి, చర్మవ్యాధులకు పోస్టు ద్వారా వైద్యం చేయబడును. వరిబీజము (బుడ్డ), మూత్రవ్యాధులు ఆపరేషన్ లేకుండా నయం చేయబడును. స్వయంగా రండి.

క్షయ, ఉబ్బస వ్యాధులకు వుచిత వైద్యం - రండి.

బ్రాంచీలు:- తిరుపతి, నెల్లూరు, గుంటూర్లలో త్వరలో తెరువబడును.

వాడు. అతని తెలివితేటల ముందు ఎవ్వరూ పనికిరారు. 'లిటిగెంట్' అన్న పదానికి అతనే నిర్వచనం. అతని ప్లాన్ ఒక రంగుల వల. అందులోంచి ఆఖరికి తిమింగలం కూడా పడి తప్పించుకోలేదు. అందుకే ఎల్లారావు యిలాంటి సమయంలో అతని 'సలహా' కోరాడు.

"మీరు ఒప్పుకుంటే, చేయగల ధైర్యం ఉంటే, ఓ కిటుకు చెప్తాను. అది పారిందంటే మనం గండం గడిచి బయట పడడము కాకుండా, పై అధికారుల ప్రశంసలు కూడా దక్కుతాయి" అన్నాడు టూ నాట్ వన్.

అతని మాటలు మునిగిపోతున్న వాడికి ఆధారం దొరికినట్టుగా ఉన్నాయి ఎల్లారావుకి.

"సరే-చెప్పు" అన్నారు ఆశగా ఎల్లారావు. తను చెప్పదలుచుకున్నది రహస్యంగా ఎస్సై చెవిలో చెప్పాడు టూనాట్ వన్. అది విన్న ఎల్లారావు ముఖం ఎర్రబడింది.

"ఒకవేళ బెడిసికొడితే ప్రమాదమేమో!" అన్నాడతను భయంగా.

"ఏం పర్వాలేదు సార్! ఇప్పుడెలాగూ మనం ప్రమాదంలోనే ఉన్నాం. ఇది పారిందంటే మీ ప్రమోషన్ మాత్రం ఖాయం" అన్నాడు హుషారుగా టూనాట్ వన్.

* * *

తెల్లవారింది.

ఆ ఊళ్ళో మరో వార్త గుప్పుమంది!

ఐ. జి.గారు బసచేసిన బంగళాలో దొంగతనం జరిగిందనీ, ఆయన రిస్టువాచీ, వజ్రపుటుంగరం, బట్టలు మాయమయ్యాయనీ అందిరికీ తెలిసిపోయింది. దేవాలయం దోపిడీకంటె యీ వార్త మరింత సంచలనాన్ని సృష్టించింది. సాక్షాత్తూ ఐ.జి.గారి వస్తువులే దొంగతనం జరిగాయంటే, దొంగలెంత కొమ్ములు తిరిగిన వారోనని తలోరకంగా చెప్పుకోవడం ప్రారంభించారు.

ఆ ఉదయం ఆ ఊళ్ళోని పోలీసు స్టేషన్ మరింత హడావుడిగా ఉంది. అందరి ముఖాల్లో దిగులు, భయం, ఆందోళన కప్పిస్తున్నాయి. ఐ.జి.గారు సరిగ్గా పదిగంటలకి స్టేషన్‌కొచ్చి తోక తొక్కిన తాచులాగా అందరి మీద బుస్సుమన్నారు. ఎస్సైగారిని నానా మాటలూ అన్నారు. సాయంత్రం ఐదు గంటల్లోపు దొంగ దొరక్కపోతే 'రివర్షన్ ఆర్డర్' అక్కడికక్కడే టైప్ చేయిస్తానని కూడా వార్నింగ్ యిచ్చారు. ఐ.జి.గారు

ఆ రోజే సాయంత్రం ఆరు గంటల ట్రెయిన్‌లో బయలుదేరి హైద్రాబాదు వెళ్ళిపోతున్నారు

కొన్ని గంటలు గడిచాయి. మధ్యాహ్నం ఒంటిగంటయ్యింది. ఐ.జి.గారు అప్పుడే లంచ్ పూర్తి చేశారు. ఎస్సైని ఎల్లారావు జీప్‌లో వచ్చి, బంగాళాలోకి ఆయాస పడుతూ వచ్చారు. అతనితోపాటు బేడీలు వేసిన ఒక వ్యక్తి కూడా వున్నాడు. అతడి పేరు సత్యరాజు. ఆ ఊళ్ళో అతడొక చిల్లర దొంగ-పాత కేడీ. ఎస్సైగారి చేతిలో ఓ పేకెట్ లాంటిది ఉంది.

ఆ పేకెట్ టేబిల్ మీద ఉంచి, అందులోంచి ఒక్కొక్కటీ బయటకు తీశారు ఎస్సైగారు. అవి పోయిన ఐ.జి.గారి వస్తువులు.

## రచయితలకు మనవి

'విజయ' లో ప్రచురణార్థం పంపే కథలు, నవలలు, కార్టూన్స్, జోక్స్, వ్యాసాలు-ఏవైనా సరే ప్రచురణార్హం కాని వాటిని త్రిప్పి పంపగోరువారు, తగినంత పోస్టేజీ అంటించిన కవర్లను జత చేయవలసిందిగా కోరుతున్నాం. అప్పుడే నిరాకరించిన వాటిని త్రిప్పి పంపటం జరుగుతుంది. ఆ తర్వాత ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ప్రయోజనముండదు. 'బాపు అభిమానుల పేజీ' లో పాల్గొనే పాఠకులు, తమ సంభాషణలను కార్డుమీద వ్రాసి పంపితే చాలు.

—ఎడిటర్.

రచనలు పంపవలసిన చిరునామా:

ఎడిటర్, 'విజయ'

80-ధనలక్ష్మి కాలనీ, మద్రాసు-600 026.

వాచీ, రింగూ, బట్టలూ అన్నీ అక్కడ మళ్ళీ యథాప్రకారంగా ఉన్నాయి.

"ఇవిగో సార్! మీ పోయిన వస్తువులు. వీడేనండి ఆ దొంగ రాస్కెల్. బ్రిడ్జి క్రింద ఈ రోజు పాతిపెడుతుండగా మన హెడ్ కానిస్టేబుల్ టూనాట్‌వన్ చూసి పట్టుకున్నాడు" అన్నాడు ఎస్సై గారు ఆవేశంగా.

ఐ.జి.గారి కళ్ళు ఆనందంగా ఆశ్చర్యంగా మెరిశాయి.

వెంటనే సత్యరాజువేపు చూసి నిప్పులు కురిశాయి.

"స్కౌండ్రల్! నా వస్తువులే దొంగతనం చేస్తావురా? ఎంత ధైర్యం నీకు?" అని చెంప చెళ్ళుమనిపించారు.

తలవంచుకుని నిలబడ్డాడు సత్యరాజు.

"కొన్ని గంటల్లో 'ఇన్వెస్టిగేషన్' పూర్తి చేసిన మీ యిద్దర్నీ అభినందిస్తున్నాను. దీనినిబట్టి మీ ప్రయత్న లోపం లేదనీ, మీ 'డ్యూటీ' సరిగ్గా నిర్వర్తిస్తున్నారనీ అర్థమయింది. ఐ కంగ్రాచ్యులేట్ బోతాఫ్‌యూ" అన్నారు ఐ.జి.గారు-ఎస్సై ఎల్లారావు,కానిస్టేబిల్ టూనాట్‌వన్‌ల వైపు తిరిగి.

"థాంక్యూ సర్!" ఇద్దరూ ఒకేసారి రిప్లయ్ యిచ్చారు ఎంతో సంతోషంతో- తనువులు పులకించి పోతూండగా.

"ఈ రాస్కెల్‌ని 'రిమాండు'లో ఉంచండి. వెంటనే 'ఛార్జి షీట్' తయారు చేయండి. ఆలయం దోపిడీలో వాడి 'రోల్' ఉందేమో కనుక్కోండి" అని ఆజ్ఞాపించారు ఐ.జి గారు.

"అలాగే సార్!" అని ఎంతో వినయంగా సమాధానం యిచ్చారు ఎస్సైగారు.

ఆ సాయంత్రమే ఐ.జి.గారు ట్రెయిన్‌లో హైద్రాబాద్ వెళ్ళిపోయారు.

* * *

ఆయన వెళ్ళిన వారం రోజులకి ఎస్సై ఎల్లారావుకి ప్రమోషన్ ఆర్డర్స్ వచ్చాయి. 'టూనాట్‌వన్'కి ప్రశంసా పత్రం వచ్చింది. దేవాలయం దోపిడీ గురించి యింకా 'ఇన్వెస్టిగేషన్' జరుగుతూనే ఉంది. సత్యరాజుకి ఒక్క ఐ.జి.గారి వస్తువుల దొంగతనంలో తప్ప, ఆలయం దోపిడీతో సంబంధం లేదని తేలింది.

ఎస్సై, టూ నాట్ వన్‌ల ప్రోద్బలం వల్లనే సత్యరాజు ఐ.జి.గారి వస్తువుల దొంగతనం చేశాడన్న 'నిజం' మాత్రం అలాగే అట్టడుగున ఉండిపోయింది. *